
కార్యదర్శులపై కత్తి

సర్వే పేరుతో కూటమి ప్రభుత్వం వేధింపులు


జీవీఎంసీ 51వ వార్డు వుడా కాలనీ సచివాలయంలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు


జీవీఎంసీ 50వ వార్డు 292వ నంబరు సచివాలయంలో సిబ్బంది లేక ఖాళీగా ఉన్న దృశ్యం

- **కూటమి పాలనలో** కార్యదర్శులకు కొత్త కష్టాలు
- **సర్వే వివరాల** కోసం క్షేత్ర స్థాయిలో పర్యటన
- **సమయానికి** కార్యాలయానికి రాకుంటే హాజరు సమస్య
- **వలంటీర్లు లేక** పనిభారం పెరిగిందని ఆవేదన

మద్రిపాలెం :

మహాత్మాగాంధీ కన్న కలలు నెరవేర్చే క్రమంలో గత ప్రభుత్వంలో వైఎస్సార్ సీపీ అధినేత, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన సచివాలయాలు కూటమి ప్రభుత్వం పుణ్యమా అని ఉనికి కోల్పోతున్నాయని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. కొత్త ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు పూర్తయినా వలంటీర్లను విధుల్లోకి తీసుకోకపోవడంతో సచివాలయ కార్యదర్శులే పెద్ద వలంటీర్ల అవతారం ఎత్తాల్సిన దుస్థితి నెలకొంది. మరోవైపు గౌరవ వేతనం రూ.10 వేలకు పెంచుతామని ఎన్నికల వేళ కూటమి నాయకులు హామీలు గుప్పించారని... వేతనం పెంపు మాట దేవుడెరుగు.. విధుల్లోకి తీసుకుంటే అదే పదివేలని వలంటీర్లు వేయి కళ్లతో ఆశగా ఎదురు చూస్తున్నారు. విశాఖ ఉత్తర నియోజకవర్గం 49వ వార్డు పరిధిలో ఏఎస్ఆర్ నగర్, బర్మా కాలనీ, పీఆర్ గార్డెన్స్, 50వ వార్డు పరిధిలోని వుడా కాలనీ, తెన్నేటినగర్, మన్యం, మురళీనగర్ ప్రాంతాల్లో సచివాలయాలున్నాయి. 51వ వార్డు పరిధి వుడా కాలనీ, అంబేడ్కర్ కాలనీ, మహత్‌కాలనీ, కళింగనగర్, గాంధీనగర్, మాధవధార ప్రాంతాల్లో, 53వ వార్డు మసీదు వీధి, గ్రీన్‌గార్డెన్స్, శివనగర్, ఆంధ్రకేశరి నగర్ ప్రాంతాల్లో సచివాలయాలున్నాయి. వీటి ద్వారా గతంలో ప్రజలకు ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందడంతోపాటు అన్ని అవసరాలూ తీరేవి. ప్రస్తుతం క్షేత్ర స్థాయిలో ఆ పరిస్థితి లేదని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

మరోవైపు బయోమెట్రిక్ ఇబ్బందులు

సచివాలయ సిబ్బంది సర్వే కష్టాలకు బయోమెట్రిక్ ఇబ్బందులు తోడయ్యాయి. గతంలో వైఎస్సార్ సీపీ పాలనలో సచివాలయ సిబ్బంది మోనిటరింగ్‌లో భాగంగా రోజుకి మూడు సార్లు లేదా ఒకసారి బయోమెట్రిక్ విధానంలో థంబ్ వేస్తే సరిపోయేదని కార్యదర్శులు గుర్తు చేసుకుంటున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చాక రోజులో రెండు సార్లు తప్పనిసరిగా థంబ్ వేయాలనే నిబంధన పెట్టారు. అయితే ఏ కారణం చేతనైనా ఉదయం 10.30 గంటలలోపు థంబ్ వేయలేకపోతే సాయంత్రం విధులు ముగించుకున్నాక థంబ్ వేసినా ఇక ఆ రోజు సెలవు కింద పరిగణిస్తున్నారు. ఫలితంగా వేతనంలో కోత విధిస్తారని కార్యదర్శులు గగ్గోలు పెడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇలా నెలలో మూడుసార్లు జరిగినా సరే సెలవు కిందనే పరిగణిస్తున్నారని సిబ్బంది విచారణ వ్యక్తం చేస్తున్నారు. అయితే ఏదైనా సర్వే వివరాల కోసం క్షేత్ర స్థాయిలో పర్యటించి సమయానికి కార్యాలయానికి రాలేకపోతే థంబ్ వేయలేకపోతున్నామని కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఓటీపీ అడిగితే ఎదురుప్రశ్నలు

సచివాలయ సిబ్బందికి ఓటీపీ అవస్థలు కూడా తప్పడం లేదనే ఆందోళన వ్యక్తమవుతోంది. మిస్సింగ్ సర్వేకు సంబంధించి సచివాలయ కార్యదర్శులు వివరాలు సేకరించేందుకు వెళ్తుంటే... అక్కడ ఆయా ప్రాంత ప్రజలు అందుబాటులో ఉండడం లేదు. పోనీ మొబైల్‌కి వచ్చిన ఓటీపీ చెప్పండని సచివాలయ సిబ్బంది సంబంధిత వ్యక్తులను అడుగుతుంటే... మీకు ఓటీపీ ఎందుకు చెప్పాలని ప్రజలు ఎదురు తిరుగుతున్నారని, కొందరు అనుమానిస్తున్నారని సచివాలయాల సిబ్బంది వాపోతున్నారు. మాకేమైనా ఇబ్బంది వస్తే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రజలు ఎదురు ప్రశ్న వేస్తుంటే ఏం చెప్పాలో పాలుపోవడం లేదని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. సచివాలయ క్లస్టర్ పరిధిలో ప్రజలు ఇళ్ల వద్దకు విధుల్లో భాగంగా వెళ్తున్నప్పుడు సంబంధిత వ్యక్తులు అందుబాటులో లేనప్పుడు అక్కడ వేచి ఉండలేక, సచివాలయంలో థంబ్ ఆలస్యమైతే సెలవుగా పరిగణిస్తారని గుబులు చెందుతున్నారు. అలాగే ఏ పనికోసమైనా దరఖాస్తుదారులు సచివాలయాలకు వస్తుంటే వారిని ఎక్కువ సేపు వేచి ఉంచాల్సిన పరిస్థితి నెలకొనడంతో ఏం చేయాలో పాలుపోవడం లేదని సిబ్బంది చెబుతున్నారు. పేరుకు సచివాలయ కార్యదర్శి పోస్టు అయినా సరే ప్రజల దృష్టిలో పెద్ద వలంటీర్లు మాదిరీ తయారయ్యామని వాపోతున్నారు. వలంటీర్లు లేకపోవడంతో పెద్ద కష్టమే వచ్చి పడిందని సిబ్బంది గుబులు చెందుతున్నారు. పలు రకాల సర్వేల పేరిట ఫీల్డులోనే పుణ్యకాలం కాస్తా గడిచిపోతోందని అంటున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం జీవీఎంసీ అధికారులు స్పందించి సచివాలయ సిబ్బంది అవస్థలు అరికట్టేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

కార్యదర్శులకు సర్వే కష్టాలు

కూటమి ప్రభుత్వం వచ్చాక ఉద్యోగంలో మనశ్శాంతి లేకుండా పోయిందని సచివాలయ కార్యదర్శులు నిట్టూరుస్తున్నారు. పలు రకాల సర్వేల పేరిట ఇక్కట్లు తప్పడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఏ వివరాలు కావాలన్నా, ఏ సర్వే కావాలన్నా వలంటీర్లు వివరాలు సేకరించి తీసుకొస్తే... కార్యదర్శుల పని సులువుగా పూర్తయ్యేది. ప్రస్తుతం వలంటీర్లు లేకపోవడంతో ఏ చిన్న వివరం కావాలన్నా నేరుగా కార్యదర్శులే సేకరించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇటీవల ప్రైమరీ అగ్రికల్చర్ క్రెడిట్ సొసైటీ (పీఏసీఎస్) సర్వే వీరి నెత్తి మీద పిడుగుపాటు మాదిరిగా తయారైందని వాపోతున్నారు. అసలు ఈ సర్వే ఏంటో తమకు తెలియదని జుత్తు పీక్కుంటున్నారు. అసలు ఈ సర్వే కేంద్ర ప్రభుత్వానిదా..?, లేక రాష్ట్ర ప్రభుత్వానిదా..? అన్న స్పష్టత కూడా లేకపోవడం గమనార్హం. వాస్తవానికి ఏ సర్వే అయినా ముందుగా గతంలో సిబ్బందికి శిక్షణ ఇచ్చేవారని, కూటమి ప్రభుత్వం వచ్చాక శిక్షణను అటకెక్కించేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో వార్డు వలంటీర్లకు ఒక యాప్ ఉండేదని.. ప్రస్తుతం ఆ యాప్‌ను కార్యదర్శుల మొబైల్ అప్లికేషన్ పేరుతో దాని కార్యకలాపాలన్నీ సిబ్బందికి అప్పగించడం తీవ్ర దుమారం రేపుతోంది.

క్లుప్తంగా

వాకర్స్ క్లబ్‌ల ఆశయాలు నెరవేర్చాలి


కార్యాలయం ప్రారంభిస్తున్న రాళ్లపల్లి సత్యనాథం, తదితరులు

మురళీనగర్ : వాకర్స్ ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలనే ఆశయాలు వాకర్స్ ఇంటర్నేషన్ డిస్ట్రిక్ట్ – 101 నెరవేర్చాలని వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు కార్యదర్శి రాళ్లపల్లి సత్యనాథం సూచించారు. మురళీనగర్‌లోని బ్యాంక్ స్ట్రీట్‌లో వాకర్స్ జిల్లా 101 గవర్నర్ కార్యాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం నూతన గవర్నర్‌గా ఎంపికైన కె.ద్వారకానాథ్ ఈ ఏడాది నిర్వహించాల్సిన కార్యక్రమాల ప్రణాళిక ప్రకటించారు. అనంతరం వాకర్స్ ఇంటర్నేషనల్ – 2025 సంవత్సరం డైరెక్టరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్‌సీ – 5 యు.శుభ, పూర్వ గవర్నర్లు టి.రంగారావు, జి.సూర్యనారాయణ, ఎ.లక్ష్మీ రెడ్డి, కేబినెట్ కార్యదర్శి ఆర్ఆర్ఎస్ మహేష్, కోశాధికారి డి.లక్ష్మణరావు, డి.శిరీష, సీహెచ్ జ్యోతి, పల్లా చంద్రమౌళి పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యం


దుర్గాప్రసాద్

సీతమ్మధార : నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక యువకుడు అదృశ్యం మీద పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అక్కయ్యపాలెం నందగిరి నగర్‌కి చెందిన దుర్గాప్రసాద్ (21) కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నాడు. ఆనందపురం మండలం గిడిజాలలో గల సాయి గణపతి ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఉదయం పూట కళాశాలకు వెళ్తూ... సాయంత్రం పూట రేపిడో బైక్ సర్వీస్ చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో దుర్గాప్రసాద్ బుధవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో తల్లిదండ్రులు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో గురువారం నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ సత్యనారాయణ పర్యవేక్షణలో ఏఎస్ఐ వెంకటరమణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అధ్వానంగా పారిశుధ్యం


సీతంపేట గొల్లవీధి డ్రెయిన్‌లో పేరుకుపోయిన చెత్త

సీతంపేట : అధికారుల పర్యవేక్షణ లోపంతో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. జీవీఎంసీ 25వ వార్డు గురుద్వారా కూడలి నుంచి గొల్లవీధికి వెళ్లే మార్గంలో కుమార్ క్యాటరింగ్ ఎదురుగా డ్రెయిన్‌లో చెత్త పేరుకుపోయింది. సక్రమంగా డ్రెయిన్‌లో వ్యర్థాలు తొలగించకపోవడం వల్ల చెత్త పేరుకుపోయి మురిగినీటి ప్రవాహానికి అడ్డంకిగా మారిందని స్థానికులు అంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వార్డులో పారిశుధ్యం మెరుగుపర్చేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఏయూ పురుషుల హాకీ జట్టు ఎంపిక

విశాఖ విద్య: ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఆంధ్రా యూనివర్సిటీ పురుషుల హాకీ జట్టు ఎంపిక గురువారం జరిగింది. మద్రాస్ యూనివర్సిటీలో ఈ నెల 3 నుంచి 7వ తేదీ వరకు ఈ పోటీలు జరగనున్నాయి. ఈ సందర్భంగా ఏయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆచార్య ఎన్.విజయమోహన్ క్రీడాకారులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు, కోచ్‌లకు ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్ ధనుంజయరావు డీఏను పెంచి సహకారం అందించారన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తారని చెప్పారు. జట్టు కోచ్ రాంబాబు, మేనేజర్, నక్కపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల పీడీ దుర్గారావు, డాక్టర్ దిలీప్ పాల్గొన్నారు.

సప్దర్ హష్మీ సేవలు అపూర్వం


కళాజాత ప్రదర్శిస్తున్న ప్రజా నాట్యమండలి సభ్యులు

సీతమ్మధార : ప్రజా కళాకారుడు, వీధి నాటక ప్రయోక్త సప్దర్ హష్మీ సేవలు అపూర్వమని ప్రజానాట్యమండలి సభ్యులు కళాజాత రూపకాల ద్వారా నివాళులర్పించారు. ఈ మేరకు ప్రజా నాట్యమండలి విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రజా కళాకారుడు, వీధి నాటక ప్రయోక్త సప్దర్ హష్మీ 36వ వర్ధంతి సభ ఆర్టీసీ కాంప్లెక్సు దరి జీవీఎంసీ గాంధీ పార్కులో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా నాట్యమండలి కళాకారులు ఆధ్వర్యంలో పాటలు, వీధి నాటికలు, నత్యాలు, ప్రదర్శించారు. ఈ సందర్భంగా హష్మీ చేసిన సేవలను స్మరిస్తూ పాటలు, నృత్యరూపకాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి విశాఖ జిల్లా కమిటీ కార్యదర్శి ఎం.చంటి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

తాటిచెట్లపాలెం : అక్కయ్యపాలెం సెక్షన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ జోన్ – 1 (ఆపరేషన్) ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. అబిద్‌నగర్, షాదీఖానా ఏరియా, ముస్లిం తాటిచెట్లపాలెం, బీఎండబ్ల్యూ షోరూం ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, ప్రజలు సహకరించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో తిరుప్పావడ సేవ


శ్రీలలితాపీఠంలో పులిహోరతో అలంకరించిన వేంకటేశ్వరుడు


గోదాదేవి అమ్మవారి ప్రతిమతో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న ఈవో ప్రసాద్, అర్చకుడు శేషాచార్యులు, భక్తులు

సీతంపేట : ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శ్రీలలితాపీఠంలో శ్రవణ నక్షత్రం సందర్భంగా స్వామి వారికి తిరుప్పావడ సేవ గురువారం నిర్వహించారు. 30 కిలోల పులిహోరతో స్వామి వారి రూపాన్ని అలంకరించి అష్టోత్తర పూజ, శ్రీనివాస గద్యం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠంలో కొలువైన కల్యాణ వేంకటేశ్వరస్వామి ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. దీప పాశురం సందర్భంగా శుక్రవారం సాయంత్రం 6 గంటలకు భక్తులచే వివిధ దీపాలతో విశేష దీప హారతి సమర్పిస్తామని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

శ్రీరంగనాథునికి పాశుర విన్నపం

మురళీనగర్ : కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి సన్నిధిలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా గురువారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 4 గంటలకు ప్రాతఃకాలార్చన చేశారు. గోదాదేవి విగ్రహంతో మేళతాళాల మధ్య అర్చకుడు శేషాచార్యులు, భక్తులు ఆలయ ప్రదక్షిణ చేశారు. అనంతరం తిరుప్పావై సేవా కాలం, విశేష భోగం సమర్పించారు. గోదాదేవి తరుపున శ్రీరంగనాథునికి 18వ పాశురం విన్నవించారు.

8 కిలోల పాలిథిన్ కవర్లు స్వాధీనం


రైతుబజార్‌లో తనిఖీలు చేస్తున్న ఏఎంహెచ్‌వో దుర్గాప్రసాద్


చేపల మార్కెట్‌లో తనిఖీలు చేస్తున్న అధికారులు

సీతమ్మధార : ప్లాస్టిక్ నిషేధం అమలులో భాగంగా జీవీఎంసీ జోన్ – 3 ప్రజారోగ్యశాఖ అధికారులు దాడులు చేసి వ్యాపారులకు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఇందులో భాగంగా 23వ వార్డు పరిధిలో గల సీతమ్మధార రైతుబజార్‌లోని పలు స్టాళ్లలో అధికారులు దాడులు చేసి వ్యాపారులు, రైతులకు ఆదేశాలు జారీ చేశారు. జోన్ – 3 సహాయ వైద్యాధికారి దుర్గా ప్రసాద్, శానిటరీ సూపర్‌వైజర్ జి.సత్యనారాయణ ఆధ్వర్యంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.సత్యనారాయణ పలు స్టాళ్లలో తనిఖీలు నిర్వహించి 8 కిలోల పాలిథిన్ కవర్లు స్వాధీనం చేసుకున్నారు. అలాగే పక్కనే ఉన్న జీవీఎంసీ హాకర్స్ జోన్‌లో గల చేపలు, కూరగాయల స్టాళ్లను అధికారులు తనిఖీ చేశారు. ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సచివాలయం పారిశుధ్య కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

చురుగ్గా హౌసింగ్ డీడీల వాపస్


దరఖాస్తుదారునికి బయోమెట్రిక్ నమోదు చేస్తున్న సిబ్బంది

సీతమ్మధార : ఇళ్ల కోసం డీడీలు కట్టినా మంజూరు కాకపోవడంతో లబ్ధిదారులకు అధికారులు డీడీలను వాపసు చేశారు. జోన్–3 పరిధిలోని 500 మంది దరఖాస్తుదారులకుగాను ప్రభుత్వం రూ.కోటి నిధులు విడుదల చేయడం తెలిసిందే. దీంతో కొద్ది రోజులుగా దరఖాస్తుదారులకు యూసీడీ విభాగం సిబ్బంది చెక్కులను అందజేస్తున్నారు. జోన్ పరిధిలోని తూర్పు, ఉత్తర నియోజకవర్గాలకు చెందిన దరఖాస్తుదారులకు యూసీడీ విభాగంలో బయోమెట్రిక్ విధానంలో వివరాలు నమోదు చేస్తున్నారు. దరఖాస్తుదారుల ఆధార్ కార్డు, బ్యాంక్‌ఖాతా, డీడీ కాపీ వంటి వివరాలు తీసుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. రోజుకు 40 నుంచి 50మంది వివరాలు సేకరిస్తున్నారు. జోనల్‌కమిషనర్ కే.శివప్రసాద్ పర్యవేక్షణలో ఏయూసీడీ విభాగం అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ రాము ఆధ్వర్యంలో సిబ్బంది దరఖాస్తుదారుల వివరాల సేకరణ, చెక్కుల జారీలో నిమగ్నమయ్యారు.

సిరుల తల్లికి పంచామృతాభిషేకం

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.శోభారాణి, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ


వేదికపై మాట్లాడుతున్న అతిథులు

కంచరపాలెం : స్థానిక ఊర్వశి కూడలిలో గల గౌరీ డిగ్రీ, పీజీ కళాశాల ఆవరణలో గౌరీ సంక్షేమ సేవా సమితి అధ్యక్షుడు పిల్లా రామకృష్ణ, కార్యదర్శి కె.వి.ప్రసాద్ అధ్వర్యంలో గురువారం నూతన సంవత్సర క్యాలెండర్, డైరీ ఆవిష్కరించారు. చార్టెడ్ అకౌంటెంట్ ఏవీ రమణ, పి.రమణారావు వేడుకలు ప్రారంభించారు. అనంతరం 2024లో రిటైర్డ్ అయిన సమితి సభ్యులను ఎస్.వెంకటరావు, కె.శ్రీనివాసరావు, బి.లక్ష్మణ్‌మూర్తి, వై.వి.నాయుడు ఘనంగా సత్కరించారు. పలు సాంస్కృతిక కార్యాక్రమాలు నిర్వహించారు. అనంతరం సమితి సభ్యులకు, అతిథులకు డైరీ, క్యాలెండర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ పి.రామారావు, లచ్చ అప్పారావు, శ్రీలక్ష్మి, వేగి సత్యనారాయణ, డాక్టర్ దిలీప్, డాక్టర్ చంద్రశేఖర్, పి.ఎస్ నాయుడు, కాండ్రేగుల సూర్యనారాయణ, సమితి సభ్యులు పాల్గొన్నారు.

చిన్నరాము నిస్వార్థ సేవకుడు


చిన్న రాము (ఫైల్)

తాటిచెట్లపాలెం : సమాజానికి చిరునవ్వుతో, మూడు దశాబ్దాల పాటు చిన్నరాము (కాళ్ల వరాహ రామ సత్యనారాయణ) నిస్వార్థంగా అందించిన సేవలు ఉన్నతమైనవని ది వరల్డ్ టీచర్ ట్రస్ట్ (జగద్గురు పీఠం) డైరెక్టర్ ఆఫ్ సర్వీసెస్ చింతలపాటి సత్యదేవ్ కొనియాడారు. ది వరల్డ్ టీచర్ ట్రస్ట్, కులపతి ట్రస్ట్, మాస్టర్ ఇ.కె సంస్మృతి సదన్‌లో చిన్నరాము అందించిన సేవలు మరువరానివని తెలిపారు. తీవ్ర అనారోగ్యంతో అక్కయ్యపాలెంలో బుధవారం తుదిశ్వాస విడిచారని తెలిపారు. గురువారం అంత్యక్రియల్లో సీహెచ్ఎస్ఎన్ రాజు, బీఆర్‌కే రాజు, అజ్జరపు శ్రీనివాస్, సీహెచ్ శ్రీనివాసరాజు, వీడీఎస్ రామరాజు పాల్గొని సంతాపం వ్యక్తం చేశారు.

రెవెన్యూ సదస్సు నేడు

సీతమ్మధార : జీవీఎంసీ 14వ వార్డు బాలయ్యశాస్త్రి లే అవుట్, 25వ వార్డు సీతంపేట ప్రాంతాల ప్రజలకు సీతమ్మధార దరి బాలయ్య శాస్త్రి లే అవుట్ వద్ద గల నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ వెనుక రోడ్డులోని సింధూర కల్యాణ మండపంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నారు. ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు పాల్గొంటారని సీతమ్మధార తహసీల్దార్ ఎం.రమేష్ తెలిపారు. భూ వివాదాలు, సమస్యలపై ప్రజలంతా లిఖిత పూర్వకంగా సదస్సులో ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు.

యూజీడీ లీకుతో అవస్థలు


మధురానగర్ రోడ్‌లో లీకవుతున్న యూజీడీ మ్యాన్‌హోల్

సీతంపేట : జీవీఎంసీ 25వ వార్డు మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్ వద్ద యూజీడీ మ్యాన్‌హోల్ లీకవుతోంది. గత రెండు వారాలుగా మురుగు నీరు రోడ్డెక్కి ప్రవహిస్తోంది. దీంతో పాదచారులు, వాహన చోదకులు, స్కూల్‌కి వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మద్రిపాలెం : కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గత నెల 20న ఊర్వశి జంక్షన్ వద్ద ఉన్న బాలాజీ స్ట్రీట్‌లో ఓ వ్యక్తి పడిపోయి ఉండడాన్ని స్థానికులు గమనించి 108కు సమాచారం అందించారు. ఆ వాహనంలోనే కేజీహెచ్‌కు తరలించారు. అతని మానసిక స్థితి బాగో లేదని, ఈ ప్రాంతంలోనే భిక్షాటన చేసుకుంటూ ఉండేవాడని స్థానికులు తెలిపారు. మానసిక పరిస్థితి బాగోలేక, కేజీహెచ్‌లో చికిత్సకు సహకరించపోవడం వల్ల గత నెల 30న మృతి చెందినట్లు పోలీసలు తెలపారు. అతని వయస్సు సుమారు 60 సంవత్సరాలు ఉండవచ్చని, కంచరపాలెం వీఆర్‌వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించాలని కోరారు.

రైల్వే స్టేషన్ సమీపంలో ఒకరు...



సీతమ్మధార : నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గల రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని యాచకుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రైల్వే స్టేషన్ సమీపంలో 55 సంవత్సరాల వయసు గల వ్యక్తి కొంతకాలంగా భిక్షాటన చేస్తూ జీవిస్తున్నాడు. ఈ నేపథ్యంలో అతను గురువారం ఉదయం ఒకటో నంబర్ ప్రవేశ ద్వారం వద్ద చలనం లేకుండా పడిపోయి ఉండడం గమనించిన కొంత మంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అక్కడికి చేరుకున్న నాలుగో పట్టణ పోలీసులు మృతదేహాన్ని కేజీహెచ్‌కి తరలించారు. సీఐ సత్యనారాయణ పర్యవేక్షణలో దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్లపై ఆవుల హల్‌చల్


నక్కవానిపాలెంలో రోడ్డు మొత్తం ఆక్రమించి తిరుగుతున్న ఆవులు


రైతుబజార్‌లో తిరుగుతున్న ఆవు

- రైతుబజారులోనూ అదే తీరు
- భయాందోళనలో వాహనచోదకులు, వినియోగదారులు

సీతమ్మధార: సీతమ్మధార పరిసర ప్రాంతాల్లో ఆవులు హల్‌చల్ చేస్తున్నాయని స్థానిక ప్రజలు వాపోతున్నారు. పలు ప్రాంతాల్లో రోడ్లు, రైతుబజార్‌లో నిత్యం ఆవులు తిష్ట వేస్తున్నాయని, రాకపోకల సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక రైతుబజార్‌లో ఆవులు హల్‌చల్ చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. అటు మార్కెటింగ్ శాఖ అధికారులు, ఇటు రైతుబజార్ సిబ్బంది ఎవరూ పట్టించుకోనందునే ఆవులు బజారులో దర్జాగా తిరుగుతున్నాయని వినియోగదారులు మండిపడుతున్నారు. ఇప్పటికే బజారులో పలు ఆవులు తిరుగుతూ అందినకాడికి కూరగాయలు, ఆకుకూరలు తినేస్తున్నాయని రైతులు, వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. అయినప్పటికీ సిబ్బంది కనీస చర్యలు తీసుకోవడం లేదని వాపోతున్నారు. నెల రోజుల కిందట రైతుబజార్‌లో ఒక ఆవు 60 ఏళ్ల వృద్ధుడిపై దాడి చేసి పొడవడంతో తలపై గాయమైంది. అప్పటి నుంచి వినియోగదారులు బజారులో ఆవులను చూస్తే బెంబేలెత్తిపోతున్నారు. రైతుబజార్‌లో నిత్యం పలు ఆవులు తిరుగుతున్నా సిబ్బంది, అధికారులు చర్యలు తీసుకోకపోవడం పట్ల పలువురు వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారులు స్పందించి సీతమ్మధార రైతుబజార్‌లో ఆవులు ప్రవేశించకుండా జాలీలు ఏర్పాటు చేయించాలని వినియోగదారులు కోరుతున్నారు. అలాగే సీతమ్మధార పరిసర ప్రాంతాల్లో నిత్యం ఆవులు రోడ్డు మీదనే సంచరిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. పగలు, రాత్రి తేడా లేకుండా వందలాది ఆవులు రోడ్ల మీదనే తిరుగుతుండడంతో వాహనచోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. నక్కవానిపాలెం, పీ అండ్ టీ కాలనీ, టీపీటీ కాలనీ, బాలయ్య శాస్త్రి లే అవుట్, అల్లూరి సీతారామరాజు జంక్షన్, ఎంవంటీసీ కాలనీ, తదితర ప్రాంతాల్లో రోడ్ల మీదనే ఆవులు తిష్ట వేస్తున్నాయి. జీవీఎంసీ వెటర్నరీ విభాగం అధికారులు ఇప్పటికైనా స్పందించి ఆవులను తరలించేలా తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు, రైతుబజార్ సిబ్బంది కోరుతున్నారు.